క్లుప్తంగా

గిరిజన సహకార సంస్థ లోటుపాట్లు సరిచేస్తాం



విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తిరుపతి

జన్నారం: గిరిజన సహకార సంస్థ లోటుపాట్లను సరిచేసి ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జీసీసీ రాష్ట్ర చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. మండలం కేంద్రంలోని జీసీసీ కార్యాలయాన్ని, రేషన్ సరుకుల విక్రయ కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఉట్నూర్ జీసీసీ ఇన్‌చార్జి డివిజనల్ మేనేజర్ సందీప్‌కుమార్, స్థానిక మేనేజర్ బాలాజీ తదితరులు ఉన్నారు.

లాఠీపట్టి..విజిల్‌కొట్టి



ట్రాఫిక్ పోలీసు విధుల్లో విద్యార్థినులు

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివే ముగ్గురు విద్యార్థినులు శుక్రవారం ట్రాఫిక్ పోలీసుల అవతారం ఎత్తారు. కొద్దిసేపు తాండూర్‌లో ట్రాఫిక్ పోలీసు విధులు నిర్వహించారు. చేతిలో లాఠీలు పట్టుకుని విజిల్ కొడుతూ ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. మాదారం ఎస్సై సౌజన్య నేతృత్వంలో ట్రాఫిక్ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ విద్యార్థినులతో విధులు చేయించారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ముల్కల్లగూడ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం డీఈవో యాదయ్య పరిశీలించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడి పరిసరాలను పరిశీలించారు. కొత్తగా పాఠశాలకు వచ్చిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంఈవో శైలజ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

పాఠశాలల్లో..

జన్నారం/చెన్నూర్/భీమారం/భీమిని: జన్నారం మండలం కిష్టాపూర్, చెన్నూర్‌లోని పద్మనగర్, భీమారం, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. రేండ్లగూడలో అక్షరభ్యాసం అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు కుర్చీలను విరాళంగా అందజేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంఈవోలు విజయ్‌కుమార్, రాధాకృష్ణమూర్తి, గోపాల్‌రావు, కృష్ణమూర్తి, హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ గ్రామంగా ధర్మారం ఎంపిక

జన్నారం: మండలంలోని ధర్మారం గ్రామం ప్రకృతి వ్యవసాయ (నేచురల్ మిషన్ ఆన్ నేషనల్ ఫామింగ్)గా ఎంపికైంది. శుక్రవారం ఏఈవో త్రిసంధ్య రైతులతో కలిసి పొలాల్లో పర్యటించి మట్టి నమూనాలు సేకరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడే రైతులను ఎంపిక చేసినట్లు తెలిపారు. పశు సంపద కలిగి, పచ్చిరొట్ట వేసే రైతులు ఈ పథకం కింద అర్హులవుతారన్నారు.

9 రోజులు..683 దరఖాస్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. శుక్రవారం 9వ రోజు గఢ్పూర్, దొనబండ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో గఢ్పూర్‌లో 92, దొనబండలో 104 దరఖాస్తులు అందాయి. భూ విస్తీర్ణంలో తేడాలు, విరాసత్ తదితర భూ సమస్యలకు సంబంధించి మొత్తం 9 రోజుల్లో 683 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే తెలిపారు. నాయబ్ తహశీల్దార్ అతీక్, గిర్దావర్లు పాల్గొన్నారు.

రంపపు మిషన్‌తో నరికిన చెట్టు

దండేపల్లి: హరితహారంలో భాగంగా మండలంలోని చెల్కగూడ జీపీ పరిధిలో ముత్యంపేట నుంచి చింతపల్లికి వెళ్లే రోడ్డుపక్కన గతంలో నాటిన కానుగ మొక్కలు చెట్లుగా ఎదిగి నీడనిస్తున్నాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం రంపపు మిషన్‌తో సగానికి పైగా నరికివేశాడు. ఈ విషయమై చెల్కగూడ పంచాయతీ కార్యదర్శి మధుకర్‌ను సంప్రదించగా, చెట్లను రంపపు మిషన్‌తో కట్‌చేసిన వ్యక్తికి నోటీసు జారీ చేశామన్నారు. దానికి వివరణ ఇవ్వకుంటే ఫైన్ విధించడంతోపాటు, కేసు నమోదు చేస్తామని తెలిపారు.

చిన్నారులకు ఎగ్ బిర్యానీ



బూర్గుపల్లిలో పిల్లలతో కలిసి ఎగ్‌బిర్యానీ తింటున్న కలెక్టర్ కుమార్‌దీపక్

- అంగన్‌వాడీల్లో అమలుకు ప్రభుత్వం చర్యలు
- వారంలో రెండురోజులు అందించేలా నిర్ణయం
- కేంద్రాల్లో పెరగనున్న పిల్లల సంఖ్య

భీమారం: చిన్నారులకు పోషకాహారం అందించేందుకు రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రంలో ఎగ్ బిర్యానీ అందించాలని ఆదేశాలు జారీ చేసింది. వారంలో రెండు రోజుల్లో వీటిని అందించేలా కొత్త మెనూ తీసుకువచ్చింది. ప్రతి కేంద్రంలో అమలుకు చర్యలు చేపట్టింది. భీమారం మండలం బూర్గుపల్లిలో కలెక్టర్ కుమార్ దీపక్ స్వయంగా వెళ్లి ఎగ్ బిర్యానీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనివల్ల కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెరుగనున్నారు. చెన్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మండలాల్లో మొత్తం 242 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటివరకు కేంద్రాల్లో ప్రతీరోజు భోజనంతోపాటు కోడిగుడ్డు అందిస్తున్నారు. గతంలో నామమాత్రంగా ఉన్న కేంద్రాలను ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. గతంలో దొడ్డు బియ్యంతో వండిన భోజనాన్ని పిల్లలకు తక్కువగా తినేవారు. ప్రభుత్వ పాఠశాలలకు సన్న బియ్యం అందిస్తుండంతో వాటితో చేసిన భోజనం చేసే వారిసంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సన్నబియ్యం అందిస్తుండడంతో పిల్లలు భోజనం చేస్తున్నారు.

భవనాలకు రంగులు వేసి..

అంగన్‌వాడీ కేంద్రాల భవనాల రూపురేఖలు మారాయి. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న భవనాలకు రంగులు వేసి పిల్లలను ఆకట్టుకునేలా పలు చిత్రాలు వేశారు. అదేవిధంగా ఆధునిక మరుగుదొడ్ల ఏర్పాటుతో అంగన్‌వాడీలు ప్రైవేట్ పాఠశాల తలదన్నేలా తీర్చిదిద్దారు.

మంచి నిర్ణయం



ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ అందించడం మంచి నిర్ణయం. రోజు ఒకేలా ఆహారం కాకుండా రెండు రోజులు ఎగ్‌బిర్యానీ ఇవ్వడంతో పిల్లలు కేంద్రానికి వెళ్తారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా వస్తారు.

– కాల్వ లత, గృహిణి, భీమారం

ఇంటిని మరిపించేలా..



చిన్నపిల్లలు ఇంటిని మరిపించే వాతావారణాన్ని కేంద్రాల్లో కల్పించాం. ప్రభుత్వం కేంద్రాల్లో రెండు రోజులు ఎగ్ బిర్యానీ అందించాలని ఆదేశాలు ఇచ్చింది. పిల్లలకు ఔషధ గుణాలు ఉన్న జాపత్రి, లవంగాలు లాంటితో ఎగ్ బిర్యానీ చేసి పెడుతాం.

– పెండ్రి స్వప్న
అంగన్‌వాడీ టీచర్, భీమారం

అర్హులకే మార్కెట్ స్టాళ్లు కేటాయించాలి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి సమీకృత కూరగాయల మార్కెట్ స్టాళ్ల (షెటర్లు)ను అర్హులకే కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ మాట్లాడుతూ షెటర్ల కేటాయింపును లాటరీ పద్ధతిన చేపట్టినప్పటికీ అక్రమంగా కొందరు అర్హుల పేర్లకు బదులుగా దళారులను జాబితాలో చేర్చడంపై మండిపడ్డారు. అనర్హులకు కేటాయించిన ఐదు షెటర్లను అర్హులకు ఇవ్వాలని లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు స్వామి, మనోహర్, శ్రీనివాస్, జలీల్, ఆనంద్, సుదర్శన్, కలీల్‌బేగ్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆయిల్‌పాం తోటలతో లాభాలు

లక్సెట్టిపేట: ఆయిల్‌పాం తోటల సాగుతో అధిక లాభాలుంటాయని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి అనిత అన్నారు. రంగపేట పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రైతులతో సమావేశమై మాట్లాడారు. ఆయిల్‌పాం తోటల సాగు మన నేలలకు అనుకూలంగా ఉంటుందని, ప్రభుత్వం రాయితీపై మొక్కలు పంపిణీ చేస్తోందన్నారు. అనంతరం వారికి అవగాహన కల్పించారు. గ్రామంలో ఆయిల్ పాం తోటలను పరిశీలించారు.

అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపిక

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నుంచి హైదరాబాద్‌లో జరిగే అండర్-19 క్రికెట్ జట్టు కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు రాగా, అందులో 84 మందిని ఎంపిక చేసి, ఆరు జట్లుగా విభజించినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రదీప్, కోచ్ ప్రదీప్, కమిటీ సభ్యులు సుధీర్, చందు, రమేశ్ తెలిపారు.

భూములకు పట్టాలివ్వాలి

కోటపల్లి: తమ భూములకు పట్టాలివ్వాలని గ్రామస్తులు, రైతులు కోరారు. శుక్రవారం సర్వాయిపేటలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో తహసీల్దార్ రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 300 ఎకరాల్లో 50 ఏళ్లుగా సాగు చేస్తున్నామని భూములకు పట్టాలివ్వాలని కోరారు.

మహాసభలు జయప్రదం చేయాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు. నాయకులు ఖలిందర్ ఆలీఖాన్, మేకల దాసు, రాజేశ్వర్‌రావు, పోలు, సత్యనారాయణ, లింగం రవి, రవీందర్, రామన్న, మహేశ్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్: జిల్లాలో నిరాక్షరాస్యులైన ప్రతీ ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వయోజన విద్యాధికారి ఏ.పురుషోత్తంనాయక్, జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈ డి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి సీసీలు, ఏపీఎంలు, ఆపరేటర్లతో న్యూఇండియా లిటరసి కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 15 ఏళ్లు పైబడిన 1 లక్షా 20 వేల మందిని నిరక్షరాస్యులుగా గుర్తించామన్నారు. తొలివిడతలో 30,600 మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ఎంపిక చేశామని అన్నారు. కాసిపేట మండలాన్ని వందశాతం అక్షరాస్యత మండలంగా మార్చామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ యాప్ ద్వారా ఈ నెల 20 లోగా నిరక్షరాస్యుల వివరాలు నమోదు చేయాలన్నారు.

అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా, వెంకటేశ్వర థియేటర్ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీ టాకీస్ చౌరస్తాల్లోని జంక్షన్లను కలెక్టర్ పరిశీలించారు. పెండింగ్ పనులు పూర్తి చేసి, జంక్షన్ల పనులు త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీ, ఇంజనీర్లను ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

భీమారం: వివిధ ధ్రువపత్రాల జారీ కోసం వచ్చే అర్జీల త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం భీమారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని తహసీల్దార్ సదానందంని ఆదేశించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన పనులు పరిశీలించారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత

నస్పూర్: జిల్లాలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి వెండి పతకాలు సాధించిన క్రీడాకారులు ఎండీ.ఉబైద్‌ఖాన్, క్రితి అగర్వాల్, కోచ్ సీహెచ్.రాజేశ్‌ను కలెక్టర్ శుక్రవారం ఆయన చాంబర్‌లో అభినందించారు. జిల్లా యువజన క్రీడసేవల శాఖ అధికారి జి.హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందేలా చూడాలి

జన్నారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చూడాలని జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) రవూఫ్‌ఖాన్ అన్నారు. అమ్మమాట, అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మూడేళ్లు దాటిన పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఐసీడీఎస్ సీడీపీవో రేష్మా, సూపర్‌వైజర్లు పద్మ, దీపవాహిని, కవిత, పంచాయతీ కార్యదర్శి శ్రీపాల్, టీచర్లు ఉన్నారు.



మొక్కలు నాటుతున్న రవూఫ్‌ఖాన్, సిబ్బంది

పంచాయతీ ట్రాక్టర్‌కు ఆర్టీఏ జరిమానా

కోటపల్లి: మండలంలోని జనగామ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను ప్రైవేటు పనులకు వినియోగించగా ఆర్టీఏ అధికారులు జరిమానా విధించారు. కార్యదర్శి గుట్టుచప్పుడు జరిమానా చెల్లించి ట్రాక్టర్‌ను తీసుకొచ్చినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంచాయతీ ట్రాక్టర్ కార్యదర్శి ప్రైవేటు పనుల నిమిత్తం మంచిర్యాల వెళ్తుండగా గురువారం సాయంత్రం చెన్నూర్ మండలం కిష్టంపేట జాతీయ రహదారిపై ఆర్టీఏ అధికారులు పట్టుకున్నారు. ట్రాలీకి పర్మిట్, బీమా వంటివి లేకపోవడంతో సీజ్ చేసి రూ.75,330 జరిమానా విధించి చెన్నూర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయం బయటకు వస్తే తన ఉద్యోగానికి ఎసరు వస్తుందని గుట్టుచప్పుడు కాకుండా కార్యదర్శి జరిమానా చెల్లించి ట్రాక్టర్‌ను తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లతో ఆర్థికభారమని ఇటీవల మండల కార్యదర్శులు ఎంపీడీవోకు ట్రాక్టర్ల తాళాలు అప్పగించగా.. ఈ కార్యదర్శి తన సొంత అవసరాలకు వినియోగిస్తూ పట్టుబడడం కొసమెరుపు. ఈ విషయమై కార్యదర్శిని సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఎంపీవో అక్తర్‌ను సంప్రదించగా.. తన దృష్టికి రాలేదని పేర్కొన్నారు. ఆర్టీఏ అధికారి రంజిత్‌ను సంప్రదించగా జరిమానా విధించినట్లు తెలిపారు.

మున్సిపల్‌లో వైద్యశిబిరం

చెన్నూర్: కార్మికుల ఆరోగ్యం కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది కార్మికులు, సిబ్బందికి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు లక్ష్మీప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

రక్తదానంతో ప్రాణదానం

- జీఎం ఎం.శ్రీనివాస్
- సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

శ్రీరాంపూర్: రక్తదానంతో ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడి ప్రాణదాతలుగా నిలువాలని శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్ సూచించారు. శ్రీరాంపూర్‌లోని వీటీసీ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న యువ ఉద్యోగులు శుక్రవారం ఇక్కడి డిస్పెన్సరీలో రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని జీఎం ప్రారంభించి అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల కోసం యువ ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఎంవీటీసీ మేనేజర్ కమ్రుద్దీన్, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, ఏటీఓ రామ్‌రావు, జూనియర్ మైనింగ్ అధికారి రాజకుమార్, డిస్పెన్సరీ ఫిట్ సెక్రెటరీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న జీఎం శ్రీనివాస్

ఫంక్షన్ హాల్ పరిశీలన

సింగరేణి ఫంక్షన్ హాల్‌లో సదుపాయాల పెంపునకు కృషి చేస్తున్నట్లు శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను శుక్రవారం పరిశీలించారు. మరిన్ని వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. డీజీఎం (పర్సనల్) అరవింద్ కుమార్, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సివిల్ ఈఈ సత్యనారాయణ ఉన్నారు.

శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్)గా అనిల్‌కుమార్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) పి.అరవిందరావు బదిలీ అయ్యారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం యజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఆయన్ను ఆర్జీ-2 ఏరియాకు బదిలీ చేశారు. అక్కడి పనిచేస్తున్న డీజీఎం(పర్సనల్)ఎస్.అనిల్‌కుమార్‌ను శ్రీరాంపూర్‌కు బదిలీ చేశారు. అనిల్‌కుమార్ గతంలో చాలా ఏళ్లు శ్రీరాంపూర్‌లో పని చేసిన అనుభవం ఉంది.

పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: పెండింగ్ రివైజ్డ్ పెన్షన్ క్లెయిమ్‌లు త్వరగా పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కోరారు. యూనియన్ అధ్యక్షుడు వి.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె.రాజకుమార్ శుక్రవారం గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కమిషనర్ పచౌరీని కలిసి వినతిపత్రం అందజేశారు. 11వ వేజ్‌బోర్డుకు సంబంధించి రివైజ్డ్ పెన్షన్ క్లెయిమ్‌లు 1400 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని సత్వరమే పరిష్కరించాలన్నారు.

వెంటిలేషన్ మెరుగుపర్చాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-1 గనిలో వెంటిలేషన్ మెరుగుపర్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య ఆధ్వర్యంలో శుక్రవారం గని మేనేజర్ ఆత్మారాం సహానిని కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జీఎం చర్చల కమిటీ ప్రతినిధి చంద్రమోహన్, ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య, సహాయ కార్యదర్శి పరశురాం, ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు మోతే లచ్చన్న, శివకుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కార్మికుల సమ్మె వాయిదా

శ్రీరాంపూర్: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఈనెల 16 నుంచి సింగరేణిలో పనిచేస్తున్న సులభ్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మెను వాయిదా వేస్తున్నట్లు సింగరేణి సులభ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.బ్రహ్మానందం తెలిపారు. శుక్రవారం యూనియన్ నాయకులు హైదరాబాద్‌లోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్(ఏఎల్సీ) వద్ద సమ్మెపై చర్చలు జరిపారు. యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మె చేస్తున్నట్లు ఏఎల్సీకి తెలిపారు. దీనిపై ఏఎల్సీ సింగరేణి అధికారులు, యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. చివరికి ఈనెల 16న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి డిమాండ్లపై చర్చించాలని నిర్ణయంతో సమ్మె వాయిదా వేసినట్లు వారు తెలిపారు.

క్వార్టర్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని అధికారులకు క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌లో 14 మంది అధికారులు హాజరై సీనియారిటీ ఆధారంగా క్వార్టర్లను పొందారు. ఏరియా ఎస్ఓటుజీఎం ఎన్.సత్యనారాయణ, కౌన్సెలింగ్ కమిటీ సభ్యులు, ఏజీఎం బీభత్సా, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, ఎస్టేట్ అధికారి వరలక్ష్మి, డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎల్.శ్రీధర్ పాల్గొన్నారు.

వైద్యాధికారి సమయానికి రారు



పీహెచ్‌సీ ఎదుట వేచి చూస్తున్న రోగులు

వేమనపల్లి: వేమనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సమయపాలన పాటించడం లేదని రోగులు మండిపడ్డారు. శుక్రవారం గొర్లపల్లికి చెందిన గగన్‌దీష్, బాపు కుటుంబ సభ్యులతో వైద్యం కోసం ఉదయం 9 గంటలకు పీహెచ్‌సీకి వచ్చాడు. ఆ సమయంలో నీల్వాయికి చెందిన వశాక రమేశ్ తలకు తగిలిన గాయానికి చికిత్స కోసం వచ్చాడు. మరికొందరు వైద్యం కోసం వేచిచూశారు. వైద్యాధికారి గంటల తరబడి వేచిచూసినా రాకపోవడంతో విసిగిపోయారు. ఉదయం 11.53 నిమిషాలకు వైద్యాధికారి రావడంతో రోగులు ఊపిరిపీల్చుకున్నారు. ఈవిషయమై వైద్యాధికారిని సాక్షి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

- 'సాక్షి'ఫోన్ ఇన్‌కు స్పందన

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌లో మున్సిపల్ ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.5 లక్షలతో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీపెద్దలు ప్రారంభించారు. 'సాక్షి'ఆధ్వర్యంలో గత నెల 31న నిర్వహించిన కమిషనర్ రాజలింగుతో ఫోన్ ఇన్ కార్యక్రమంలో కాలనీవాసులు పలువురు రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని విన్నవించారు. సీసీ రోడ్డు వేయాలని కోరారు. వంద మీటర్ల రోడ్డు ఏర్పాటు పనులు ప్రారంభించడంతో కాలనీవాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రారంభిస్తున్న కాలనీ పెద్దలు

పెన్షన్లపై విచారణ

భీమిని: కన్నెపల్లి మండలంలోని గ్రామాల్లో పెన్షన్లపై రూ.16 పోస్టల్ సిబ్బంది ఇవ్వడం లేదని పలువురు ఫిర్యాదుతో అధికారులు శుక్రవారం చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో బీపీఎం, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పింఛన్ల వివరాలు సేకరించారు. అంతకుముందు వెంకటాపూర్, తంగెళ్ళపల్లి, సుర్జాపూర్ గ్రామాల్లోని లబ్ధిదారులకు ఇచ్చే రూ.2016, 4016లో రూ.16 ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఎంపీడీవో శంకర్, పెన్షన్ ఎంక్వయిరీ అధికారి అబ్దుల్ సలీం, డీఆర్‌డీఏ ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

తాండూర్: రేచిని పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకుడు శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. నాయకుడు భాస్కర్‌గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సంతోష్, శ్రీనివాస్, వెంకాగౌడ్, నగేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బెల్లంపల్లిరూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ఆయుష్ విభాగం జిల్లా నోడల్ అధికారి నీరజ అన్నారు. బెల్లంపల్లిలోని షంషీర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బంది యోగాసనాలు వేశారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్యాధికారి సంజయ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య, యోగా ఇన్‌స్ట్రక్టర్స్ పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో పాటు, రోగుల సంబంధీకులకు యోగాపై శుక్రవారం అవగాహన కల్పించారు. శిక్షకులు సుధాకర్, మేఘన, ఆయుష్ వైద్యురాలు పద్మజ, డీపీఎం రవీందర్, ఆర్ఎంవో శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సాగులో నూతన విధానాలు అవలంబించాలి

భీమారం: నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతీ రైతులు ముందుకు రావాలని డీఏవో కల్పన కోరారు. పోతన్‌పల్లిలో శుక్రవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ రైతులు పంట సాగులో నూతన విధానాలు అవలంబించాలన్నారు. బెల్లంపల్లి కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, చెన్నూరు ఏడీఏ ప్రసాద్, ఏవో సుధాకర్, శాస్త్రవేత్తలు తిరుపతి, స్రవంతి, సుధాకర్ పాల్గొన్నారు.

పొనకల్‌లో డీఎల్‌పీవో పర్యటన

జన్నారం: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీలో డీఎల్‌పీవో ధర్మరాణి పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, నర్సరీల ను పరిశీలించారు. దుకాణదారులు డస్ట్‌బీన్ లు తప్పనిసరిగా వాడాలని, చెత్త బయట పడేస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎంపీవో జలెందర్, ఈవో రాహుల్ ఉన్నారు.

పరామర్శ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నర్సింగాపూర్‌కు చెందిన దారవేన కొమురన్న గురువారం సాయంత్రం గొర్రెలను మేపేందుకు వెళ్లగా పిడుగుపాటుకు గురయ్యాడు. వెంటనే మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం సతీశయాదవ్ ఆయన్ను పరామర్శించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

దండేపల్లి: లింగాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం మంచిర్యాలలో ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ రాజబాబును ఉపాధ్యాయులు జయకృష్ణరెడ్డి, ఆమీర్‌పాషా వినతిపత్రం అందించారు. ప్రిన్సిపాల్ రమేశ్ ఉన్నారు.

గుడిపేటలో పొలంబాట

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేటలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ చైతన్యం చేశారు. ఏఈ మహేందర్‌రెడ్డి, లైనెమెన్‌లు, రైతులు పాల్గొన్నారు.

చెరువు కబ్జా నుంచి కాపాడండి

వేమనపల్లి: దస్నాపూర్ శివారులో పెద్దచెరువు కబ్జా నుంచి కాపాడాలని దస్నాపూర్, కొత్తపల్లి గ్రామస్తులు కోరారు. శుక్రవారం భూభారతి గ్రామసభలో తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. పెద్ద చెరువు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా అందులో కేవలం ఏడెకరాల భూమి మిగిలి ఉండగా మిగతాది ఆక్రమణకు గురైందన్నారు. అధికారులు కొలతలు చేయించాలని కోరారు.